వెంకడు

★

శ్రీ చాగంటి సోమయాజులు

వెంకడి కళ్లాం, పొలాలూ ఎంతదూరం నుంచైనా పోల్చుకోవచ్చు. వాస్తవానికి పూర్వంకన్నా మరింత కళకట్టి దిష్టికొట్టుతున్నాయి. ఒక చేతికి యింకొక చెయ్యి తోడైన తర్వాత ఊరికే పోతుందా? అద్దంలా కళ్లాం, కుక్క అయినా దూర లేకుండా కంచె, నీళ్లతో జిమజిమలాడుతూ చెరుకులు, అరటి బోదెలు కనబడతాయి. నల్లగా, నిటారుగా తాటిమాని ఏతాం ఎంత దూరానికైనా ముచ్చటగా అనుతుంది. ఇహ, పొలాలు నల్లగా నూనె కక్కుతూ పెంటపోగులతో సాగుకి సిద్ధంగానైనా ఉంటాయి, పచ్చని చేలతో ఉయ్యాల లూగుతూ నైనా ఉంటాయి.

పుట్టిన దగ్గరనుంచీ వెంకడు ఆ పొలాల్లోనే పెరిగాడు. ఆ పొలాల గట్లంటే గోచీ అయినా లేకుండా గొఱెపిల్లని మేపేవాడు. దూడలకి గడ్డి దవిరించేవాడు. పెద్దవుతున్న కొద్దీ వాడి ప్రాణం ఆ పొలాలకి కట్టుకున్న పెళ్ళాంతో సహా పెనవేసుకుంది.

పొలాలెంత కలకల్లాడుతున్నా యిప్పుడు వెంకడి కంతా వెలవెల్లాడు తున్నాది.

వెనకటి వెంకణ్ణి ఇప్పటి వెంకణ్ణి గణితశాస్త్ర రీత్యా అర్థం చేసుకోవచ్చు.

వెనకటి వెంకడు = వెంకడు + పొలం + పెళ్లాం. పై మూడూ పెనవేసుకు కలసిన మోకు వెంకడు. తొలి కోడితో లేచి, గుర్రుపెడుతూ నిద్రపోతున్న పెళ్ళాన్ని లెగ్గొట్టి పొలాల్లో పడేవాడు. రాత్రంతా మాటుమణిగాక కళ్లం పరిశుభ్రంగా తుడుచుకుని, పెళ్ళాని కెదురుగా చుట్టకాలుస్తూ, నులకమంచం మీద కూర్చుని, సాలలో నెమరు వేసుకుంటున్న దూడలని, సాలమీద కెక్కి, చిక్కగా బలిసి, వన్నెలతో పంతం ఆడుతూ తెల్లగా వికసించిన ఆనపపాదుని, తనివితో చూసుకుంటూ సేదతేరేవాడు.

ఇప్పటి వెంకడు = వెంకడు + పొలం — (పెళ్ళాం + కొడుకు). ఇంక పిల్లలు కలగరని నిశ్చయం చేసుకున్న తర్వాత మన్నుచేసి, నీళ్ళు పోసే కొడుకుని మధ్య వయస్సులో నాయురాలు కంది. కలక్క కలక్క కలిగిన కొడుక్కి శ్రీ కూర్మం కూర్మనాథుని పేరిట కూర్మిగాడని ముద్దుగా నాయురాలు పేరు పెట్టుకుంది. ఊరంతా కూర్మినాయుడని పిలవడం మొదలు పెట్టేరు. వెంకడికి మాత్రం కూర్మిగాడిలో కూరిమి కనపడలేదు. పుట్టిన దగ్గరనుంచీ వాడి వాలకం ఒక్కలాగుంది. తను ఏతాం తోడుతూ నాయురాలు చెరుకులకు నీరుపెడుతూ ఉంటే గుడ్డ ఉయ్యాల్లోంచి కిందికి జారిపోతూ, కిరకిరలాడుతూ ఒకటే ఏడ్పు ఏడ్చేవాడు, అది ఏడుపు సంసారం కాదు. వెంకడి కాళ్లకింద నూతిగోడలు నాలుగూ కూర్మిగాడి ఏడుపును పులుగుపిట్ట స్వరంతో ప్రతిధ్వనించేవి. పిల్లణ్ణి సముదాయిస్తూ పొలం పాటుకి నాయురాలు ఎగనామం పెట్టేది. పొద్దస్తమానం కూర్మిగాడే నాయురాలి లోకం, వెంకడు కర్ర అందించమంటే, "చేతిలో పిల్లాడు కనబడ్డం లేదా?" అని కస్సని లేచేది.

ఆ కూర్మిగాణ్ణి చూసి ఆ తల్లే మెచ్చుకోవాలి. కాస్తంత గుంట నాగమ్మయినాక వాడు పొద్దస్తమానం బక్కురు కొచ్చిన గడ్డి ఒక్క దూడకైనా చాలేది కాదు. ఆ కూర్మినాయుణ్ణి ఊళ్ళోవాళ్ళే మెచ్చుకోవాలి. వాడు వేరుశనగకి గొప్పుతవ్వితే కొనలన్నీ తెగిపోయి పొలం అంతా సర్వనాశనమైపోయేది. ఊరు ఊరంతా వాణ్ణి వెనకేసు కొచ్చేవాళ్ళే.

కూర్మిగాడు చేతికందివచ్చిన కొడుకుట. చిన్నవాడైనా సంతలో బేరసారాలు వాడితో సమానంగా యింకోహరు చెయ్యలేరుట. వంకాయిలు పోగులు పెట్టడంలో వాడిది అందెవేసిన చెయ్యట. ముదరవీ, పుప్పివీ కనబడకుండా పెట్టడం, ఉన్నవి తక్కువ కాయలే అయినా ఎక్కువగా కనబడేటట్లు సర్దడం, మాసీమాడ్డంతో కొన బుద్ధిపుట్టేటట్లు నీళ్ళు జల్లి సంత మెరుగు పెట్టడం కూర్మిగాడి కొక్కడికే తెలుసునట.

వెంకడు కూర్మిగాడితో వేగలేక పోతున్నాడు. వాడి బ్రతుక్కి వాడు వెంకడికి సలహాలు చెప్పడమా? పదేళ్ళు నిండని గుంటవెధవ. అరటిగెలలన్నీ ఒకేసారి కొట్టి బండీమీద పట్నం తోలుకెళ్ళి, పదిరూపా యిలు చేసుకొని, పట్నంలో నాలుగూ కొనుక్కొని, పదం పాడుతూ బండీ తోలుకురావడం వెంకడి అల వాటు. అలాగ కాదుట. నాలుగేసి గెలలుకోసి దగ్గర సంతలకి కావిడేసుకుపోతే రూపాయికి రూపాయి లాభం వస్తుందని కూర్మిగాడి సలహా. ముష్టివెధవ సలహా. ఏ గాలీవానా అయినా వస్తే గెలలు కిందబడి ముక్కలైపోతే లాభం గూబల్లో కొస్తుందని తెలీదు.

రోజు మొత్తంలో ఒక్కసారైనా వాడితో కసాలా తప్పటంలేదు. తెల్లారిందీ అంటే వాడు తెచ్చేడన్నమాటే జట్టీ.

"నాలుగు ఆనపకాయలు కోసియ్యి. చల్దికూడు తిని మంగళారం సంతకి ఒట్టుకెల్తాను," అని పొద్దున్నే కూర్మిగా డడిగేడు.

"ఏ పాదుని కోసేపాటి కాయలు నేవు" అన్నాడు వెంకడు. నెమ్మదిగా నే చెప్పేడు.

"నేకపోడ మేటి? గట్టుమీద పాదుల్ని ఉన్నాయి. సాలమీదా ఉన్నాయి."

"నీ కెలాగ తెల్సు?"

"నాను సూసినాను."

"సూసినావూ? ఇంక ఆటిపని అయింది. ఇంకో వారం పోతేగాని కొయ్యడానికి కాయల్నేవు."

"ఆ కాయ లిప్పుడే కొయ్యాలి. ఇప్పుడు కోస్తే నే కొనేవాళ్ళు కొంటారు. ఏపాటి ముదిరినా బాపనాళ్ళు కొన్రు. ముచిక దగ్గర గోరుతో గిల్లి ఆళ్లు చూసుకుంటారు. నీ క్కాయ లెప్పుడు కొయ్యాలో తెల్దు. శీ, శీ," అని మొహం చిట్లించుకొన్నాడు కూర్మిగాడు.

వెంకడు అగ్గి అగ్గి అయిపోయినాడు. పది పన్నెండు పంటలు కళ్ళమూడని వెధవ ఏభైఏళ్ళు మళ్ళిన అయ్యని అంతమాటంటాడా? వెంకడు ఒక సంతచూశాడా? రెండు సంతలు చూశాడా? ఆనప కాయ లెప్పుడు కొయ్యాలో వాడికి తెలియదూ? సాలమీద, గట్లమీదా ఉన్న ఆనప పాదులనిండా యిప్పుడిప్పుడే పిందెలు దిగుతున్నాయి. కొన్ని గంగా బొండాం కొబ్బరి కాయలలాగ ఉన్నాయి. వాటి నిప్పుడు కోసీమంటాడు కుర్రకుంక. అవే నాలుగు రోజులు పోతే కడవలంత లవుతాయి. కడవంత కాయకి అణాడబ్బులురావు. కొబ్బరికాయంత పింజకి ఎక్కువ డబ్బులు వస్తాయా?

"ఓరి గుంటగాడిదా! తాతకిరా దగ్గులు నేర్పుతావు? ఈ పాలి పాదుల్లో కెళ్ళు సెపుతాను. నీ కళ్ళుపడితే కాయలుంటాయా? అందుకే అన్నీ మురిగిపోతున్నాయి. వాటి జోలికెళ్ళావా టెంకి మాడుతుంది," అన్నాడు వెంకడు.

"ఈపాలి నన్ను సంతకెళ్ళమను సెపతాను," అన్నాడు కూర్మిగాడు.

"మానీ, ఇంటికాడ కూకో, నానే ఎల్తాను."

"అనాగే కూకుంటాను. యువసాయంకూడా నువ్వే చేసుకో."

"ఓ అనాగే వెళ్ళు" అన్నాడు వెంకడు. సమ యానికి దగ్గిర నాయురాలులేదు. ఉంటే మరింత కొంప అంటుకొనేదే. కూర్మిగాడు తిని తిరిగేవాడు. పొలంలో పూతికపుల్ల ముట్టుకోవడంకూడా మానే సేడు. ఉళ్లో ఊసుపోకపోతే స్కూల్లో కెళ్ళి అక్కడ చదువుకుంటున్న కుర్రవాళ్ళని పోగుచేసుకొని బిళ్లా-కర్రా ఆడుకొనేవాడు.

"కూసే గాడిద మేసే గాడిదని చెడగొట్టిందట. బడిచుట్టు పక్కల కీమాటొస్తే బడితె బాజాపట్టిస్తాను. అలా తిరక్కపోతే నలుగురితోపాటు వచ్చి నాల్గు ముక్కలు నేర్చుకోరాదా?" అని బడిపంతులు చీవాట్లు పెట్టేడు.

"సెపతారా?" అన్నాడు కూర్మిగాడు.

"మేష్టర్లెందుకున్నారు? బళ్లెందుకున్నాయి?" అని చెపుతూ కూర్మినాయుణ్ణి చెవిపట్టుకొని ఈడ్చు కెళ్ళి, ఇసకలో అ, ఆ, లు రాస్తున్న పిల్లలదగ్గర కూర్చోపెట్టేడు.

మేష్టరుగారికి కూర్మిగాణ్ని చూడగానే చక్కటాలోచన తట్టింది. చురుగ్గా చాకులాగున్నాడు. నాలుగుముక్కలు చెప్పుతున్నట్టుంటే యింటిదగ్గిర నానాచాకిరీ చేయించుకోవడానికి పనికొస్తాడు. వాడక్షరాలు అవలీలగా పట్టుకొన్నాడు. పదంకెలు చెప్పి పదిపదులు చెప్పేసరికి అంకెలన్నీ యిట్టే పట్టేసుకొన్నాడు.

"నువ్వు బడికొస్తేచాలదు. యింటికికూడారా", అన్నాడు పంతులు. అంతవరకు ఏదో విరిగిపోయిన పలక, తన డ్రాయర్లో పుల్లలూ యిచ్చి చదువు

చెప్పేడు. ఇంక అలాక్కాదు. పుస్తకమూ పలకా కొనుక్కోమన్నాడు. యింటికి రమ్మన్నాడు.

కూర్మిగాడికి అయ్యతో మాటలు లేవు. వాడు పని - పాట్లు మాని ఊరపందిలా తిరుగుతూఉంటే వెంకడు కూకలెయ్య లేదు. నాయురాలు తండ్రికీ కొడుక్కీ జట్టీలు లేకుండా ఉన్నాయని సంతోషించింది. బళ్లో కెళుతున్నట్టు, బడిపంతులింటి కెళుతున్నట్టుకూడా ఆరాలు తీసింది. వాడేం చేస్తున్నదీ చూస్తానేఉంది.

"నాను పుస్తకం - పలకా కొనుక్కోవాలి. డబ్బులియ్యవా?" అని కూర్మిగాడు తల్లి నడిగేడు.

"నువ్వు సదువు కెళుతున్నావా?" అని ఏమీ ఎరగనట్టడిగింది నాయురాలు.

"వచ్చి అడుగు"

"అయితే పద" అని నాయురాలు కొడుకుని వెంటపెట్టుకొని బరికెళ్ళింది.

"మేష్టేరుబాబూ; మావోడు సదువుతున్నాట్ట నిజమేనా?" అని అడిగింది.

"వాడ్ని పలకాపుస్తకం కొనుక్కోమన్నాను" అన్నారు మేష్టరుగారు.

"కొనమని పీక్కుతింటున్నాడు. ఆడికి సదువొస్తాదా?"

"ఫస్టుగావొస్తుంది. కొను"

"అయితే మీరే కొనండిబాబూ. కాస్త ముక్క సెపుతే పంట నాడేటేనా యిచ్చుకుంటాను" అని మొల్లో డబ్బులుతీసి మేష్టరుగారికే యిచ్చింది.

ఆవేళ కూర్మిగా డరుగుమీద కూర్చుని పుస్తకం చదువుతూ ఉండగా వెంకడు చూసేడు. అరటి మొక్కలకి నీళ్ళు తోడి, తోడి జుమాయించి పోయి వచ్చేడు.

"పుస్తకమే సదివేస్తున్నా వేట్రో" అని అడిగేడు.

"ఆపాటి చదువొచ్చు" అన్నాడు కూర్మిగాడు.

"ఎవడిబొక్కు ఎత్తుకొచ్చినావు"

"ఎత్తుకురావడం ఖర్మమేమి? నానే కొనుక్కున్నాను"

"ఎదవా! పిడతలో డబ్బులు నాకు సెప్పకుండా ఎత్తుకుపోయినావా?" అని కళ్ళెర్ర జేశాడు.

"నానేమీ ఎత్తుకుపోనేదు. మా యమ్మిచ్చింది"

"ఒలే ఈడికి డబ్బులిచ్చినా?" అని పెళ్ళాన్నడిగేడు.

"ఆ, యిచ్చినాను", అని నిర్లక్ష్యంగా జవాబు చెప్పుతూ నాయురాలు గుడిశెలోంచి ఇవతలకొచ్చింది.

"మూడువోరాలనించీ ఆడు పని సెయ్యడంలేదు. ఏమిరా ఎదవా, నీకీ పోగాలం, అని అడుగుతావా? ఆడికి పుస్తకమోటికొని బుగతల్లాగా సదువుకుంటూ కూకోమంటావా?"

"పొలంలో నువ్వూ - నేనూ పడుతున్న పాటు శానలే. సిగ్గునేక మళ్ళా ఆడివూ సెందు కెత్తినావు?

"అయితే ఆణ్ని తగలెట్టు" అన్నాడు వెంకడు. గ్రామంలో ముత్యాలనాయుణ్ని మినహాయిస్తే రైతు దనంలోఅంతా నిశానీగాళ్ళే. ఊళ్ళో ఎలిమెంటరీ స్కూలున్నా ఏ ఒక్కడికీ అక్షరం అబ్బటంలేదు. మళ్ళా కూర్మిగాడు తలెత్తి చదువులవాడయ్యాడు. ఊళ్ళో సగం రంగం ఉత్తరాలు చదవడం, రాయడం వాడివొంతు కొచ్చింది. ఊళ్ళో ఐదోక్లాసుదాకా అయితే మూడుమైళ్ళదూరంలో ఉన్న పెద్ద ఊర్లో ఎనిమిదోక్లాసుదాకా అయింది. కూర్మిగాడు పట్నం వెళితే పనికొస్తాడని పదిమందీ అన్నారు. పనికిరాదని వెంకడు మూర్ఖపుపట్టు పట్టేడు. కూర్మిగాణ్ని వెనకేసుకుని ముత్యాలనాయుడితో సహా పెద్దలంతా వెంకడిమీద కొచ్చేరు.

"నలుగురు సెప్పినమాట ఇని ఆణ్ని ఇజానారం సదువుకి పంపు. ఈయాళ మనోళ్లకు ఎక్కళ్ళేని ఉద్దోగాలు వస్తున్నాయి. ఈ పెద్దపెద్ద మునసబీలు, కలకటేరులు మనోళ్ళే. ఏటనుకొన్నావో! ఆడు సదువుకు రానీ. దోశెడు రూపాయిలు బిళ్ళకుడుముల్లాగ గణిస్తాడు" అన్నారు వూళ్ళో పెద్దలు.

"సదువుకున్నోళ్లకి ఉద్దోగాలు ఎక్కడివి? ఆళ్ళంతా అగ్గరోరాల్లో వూరపందుల్లాగ తిరుగుతుంటే?" అన్నాడు వెంకడు. వాడు కళ్ళారా ప్రపంచాన్ని చూసే అన్నాడు. అగ్రహారాల్లో భూములన్నీ అమ్మేసుకు చదివి పదిరూపాయిల ఉద్యోగానికి గతిలేక పడిగాపులు పడుతున్నారు.

"ఆమాటనకు. అది బాపనాళ్ళకి. మనకేటిరా ఆసాకు తెస్తావు? ఈయేళ సెన్నపట్నంలో మంతిరి మన రాజుగారు", అన్నారు పెద్దలు.

"వచ్చిందీ ఈమాట మళ్ళా? సుద్దబద్దం. రాజుగారేటి. సెన్నపట్నం మంతిరేటి? అనోడికి బుద్దుందా?. రాజుగోరు మంతిరేటిరా ఎదవల్లారా?" అన్నాడు వెంకడు.

"ఓరి ఎర్రోడా నీకు తెలకపోతే సదువుకునోళ్ళనడుగు" అన్నారు పెద్దలు.

"సదువుకునోళ్లు అండం విన్నాను. నాను నిశానీగాణ్నే. అయినా పదికాలాలూ సూసినాను. రాజుగోరెక్కడా మంతిరికాడు. మంతిరంటే రాజుగోరి కిందివోడు. తెలిసిందా? ఢిల్లీలో కెళ్ళినాయింతే. సదువుకునోళ్ళు సెప్పినా నాను నమ్మను. గేనమున్న ఎవడూ నమ్మడు. ఇది సదువుకునోడి అబద్దం. ఆళ్ళబద్దాలు దేశాలు ధాటిపోతాయి. రాజుగారు సెన్నపట్నం మంతిరి! ఇనాగే సెప్పండి సబువులు" అన్నాడు వెంకడు.

"పసందైనకొడుకుని పాడుచేస్తున్నావు"అన్నారంతా.

"మీరు బాగుశెయ్యడానికి సెప్పినారు. ఆడు పెద్దోడైనాడు మనం సూసినాము. అందుకూ సెడతాడు. యిందుకూ సెడతాడు. ఎప్పిటికైనా మీనాగా నానాగా ఈడు దున్నుకుబతుకవలసినోడే", అన్నాడు వెంకడు.

"ఆడే సదువుకుంటే యవసాయం సెయ్యాలా? నిన్ను కూకోబెట్టి కూడుపెడతాడు"

"కూకుడుంటే కూడు ఎలతాదా? బూమిని బద్దలుచేసుకు బతకమన్నాడురా నిన్నూ నన్నూ దేమ్మదేముడు." అన్నాడు వెంకడు.

"నువ్వు బూమి బద్దలుచేసుకుంటూ సవ్వు. నా కూర్మిగాడు పట్నం ఎళతాడు" అని గుడిశెలోంచి నాయురాలువచ్చింది. దానిమాటల ఖణీల్‌లో 'నువ్వు పంపితీరాలి సచ్చితీరాలి' అని నాయురాలు ధ్వనించింది.

"ఓలెళ్ళె ఇక్కణ్ణుంచి," అన్నాడు వెంకడు.

"అందరూ ఎళ్లండి" అని మెడ తణువుకుంది నాయురాలు. నాయురాలిమెడనిండా మెడ తిరగని బంగారం అందరికళ్లకీ పచ్చగా కనపడ్డాది.

వెంకడు పెళ్ళాన్ని పెద్దలనీ తీక్ణంగా మూశాడు. చంటికుర్రాడిలాగ ఒక్క పిల్లిగంతువేసి సంతోషంతో నవ్వుతూ ఒక్క చిటిక వేసేడు.

"మా గనమైన ఆలోశన తట్టింది. దెబ్బతో బుద్ధి మారిపోయింది. ఎళ్లండ్రా అంతా ఎళ్ళండి. కూర్మిగాణ్ని నానే పట్నం అంపుతున్నాను. మరి జట్టనేదు," అన్నాడు వెంకడు.

మర్నాడు కూర్మినాయుణ్ని వెంకడే పట్నం చదువుకి పంపించేడు. పనులన్నీ పూర్తి అయినాక కళ్ళంలో చుట్టకాలుస్తూ పెళ్ళాని కెదురుగా నులకమంచంమీద కూర్చున్నాడు. కొడుకు పట్నం వెళ్ళిపోయాడని కొంచెం దిగులున్నా నాయురాలు మొగుడే పంపాడని సంబరపడుతున్నాది.

"ఈరేత్రి నా మనుసు మనసు నాగున్నాది" అన్నాది నాయురాలు.

"నామనుసూ మనుసు నాగుంది," అన్నాడు వెంకడు.